RNI: APTEL/2013/54506

# నేటి ప్రస్థానం
తెలుగు దినపత్రిక

హైదరాబాద్ | ఆదివారం 28-6-2026 | సంచిక: 13 | సంఖ్య: 272 పేజీలు: 4 | వెల: 5/- | ఎడిటర్: సందీప్ గౌడ్ వి




# రేవంత్‌ది అసమర్థ పాలన



420 అబద్ధాలతో గద్దెనెక్కారు: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

ఎన్నికలు ఎప్పుడొచ్చినా.. కాంగ్రెస్ బంగాళాఖాతంలోకే

కాంగ్రెస్ పోవాలి.. బీఆర్ఎస్ రావాలి.. ప్రజల భావన ఇదే

మహేశ్వరంలో సర్‌పై అవగాహన సభ

రంగారెడ్డి: రాష్ట్రంలో ఎప్పుడు ఎన్నికలొచ్చినా.. కాంగ్రెస్ పార్టీని బంగాళాఖాతంలో కలిపేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని మాజీ మంత్రి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. సర్‌పై అవగాహన, సభ్యత్వ నమోదు

2లో



## హైదరాబాద్ మెట్రో రైల్ అదనపు ఎండీగా అజిత్ రెడ్డి

ప్రస్తుతం ఇన్వెస్ట్ తెలంగాణ సీఈఓగా కొనసాగుతున్న అజిత్ రెడ్డికి అదనపు బాధ్యతలు

ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు ఉత్తర్వులు జారీ

మెట్రో ఫేజ్-2 విస్తరణ ప్రయత్నాల మధ్య ఈ నియామకం ప్రాధాన్యం

హైదరాబాద్ మెట్రో రైల్ లిమిటెడ్ (హెచ్ఎంఆర్ఎల్) అదనపు మేనేజింగ్ డైరెక్టర్‌గా సీనియర్ అధికారి బి. అజిత్ రెడ్డి నియమితులయ్యారు. ఆయనకు

2లో



## రాష్ట్ర రోడ్లకు ఇక మహర్దశ

హ్యామ్ రోడ్లకు నేడు సిఎం శంకుస్థాపన

నల్లగొండ జిల్లా కనగల్‌లో నేడు శ్రీకారం

**నల్లగొండ:** తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా రహదారుల రూపురేఖలను మార్చేలా ప్రభుత్వం భారీ ప్రాజెక్టుకు శ్రీకారం చుడుతోంది. హైబ్రిడ్ యాన్యుటీ

2లో

## ఆర్టీసీ కార్మికుల హామీలను నెరవేరుస్తున్నాం

వాస్తవాలను వక్రీకరించే ప్రయత్నం తగదు

మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టీకరణ

హైదరాబాద్: తెలంగాణ ఆర్టీసీ కార్మికులకు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్

## పట్టపగలు ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తారా?

సీఎం చంద్రబాబుపై వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మండిపాటు

రాజధాని రైతుల ఆహ్వానం మేరకు సీఆర్‌డీఏ రైతుల పరిరక్షణ కమిటీ పర్యటించకూడదా?

మీరు చేస్తున్న దారుణాలకు బలైపోతున్న రైతులకు తోడుగా నిలవడం తప్పా?

భూములివ్వని రైతులను నరకయాతనకు గురి చేస్తారా?

దాడులకు వైఎస్సార్‌సీపీ తలవంచదు.. మీ దారుణాలను ఎప్పటికప్పుడు ఎండగడతాం

అమరావతి: రాజధాని రైతుల ఆహ్వానం మేరకు సీఆర్‌డీఏ రైతుల పరిరక్షణ కమిటీతో కలిసి రైతులను పరామర్శించేందుకు వెళ్తున్న వైఎస్సార్‌సీపీ మాజీ మంత్రులు, ఎమ్మెల్సీలపై ఉండవల్లి సెంటర్‌లో టీడీపీ గూండాలు దాడులు చేయడం దుర్మార్గమని



2లో



## 1,430కి పెరిగిన మరణాలు

వెనెజువెలాలో శిథిలాలు తొలగించేకొద్దీ బయటపడుతున్న మృతదేహాలు

లా గువేరా: జంట భూకంపాలు వెనెజువెలాను చివురుటాకులా వణికించిన ఘటనలో ప్రాణాలు కోల్పోయిన వారి సంఖ్య అంతకంతకూ పెరుగుతోంది. శుక్రవారం 920గా ఉన్న మరణాల సంఖ్య శనివారం నాటికి ఏకంగా 1,430 దాటేసింది. మరణాల



## నేడు పల్స్ పోలియో

36.10 లక్షల మంది చిన్నారులకు చుక్కలు..

రాష్ట్రంలో 22,979 బూత్‌లు

## ముగ్గురు సీఎంల రహస్య సమావేశంలో ఏ ఒప్పందాలు జరిగాయి?: హరీశ్ రావు

చంద్రబాబు, రేవంత్, డీకే శివకుమార్ భేటీపై హరీష్ స్పందన

తెలంగాణకు అన్యాయం జరుగుతుంటే చారిత్రక ఒప్పందం అని రేవంత్ అంటున్నారని విమర్శ

శిష్యుడు సీఎం అయ్యాడని చంద్రబాబు గుండ్రేవులను తీసుకొస్తున్నారని ఆరోపణ

కర్ణాటకలో మూడు రాష్ట్రాల ముఖ్యమంత్రులు (చంద్రబాబు, రేవంత్ రెడ్డి, డీకే శివకుమార్) జరిపిన రహస్య సమావేశంలో

2లో



# వెలిగొండకు నేనే శంకుస్థాపన చేశా..

భూములు ఇచ్చిన రైతులు త్యాగం మరువలేనిది

తొలివిడతలో నిర్వాసితులకు 300 కోట్ల పరిహారం

కృష్ణాజలాలు వస్తాయని ఎవ్వరూ ఊహించలేదు

గత ప్రభుత్వ పూర్తిచేయకుండానే ప్రారంభోత్సవం

వెలిగొండ ప్రాజెక్ట్ ద్వారా లక్షల ఎకరాలకు సాగునీరు

నిర్వాసిత రైతులతో సీఎం చంద్రబాబు భేటీ



తాను ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడే వెలిగొండ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశానని, ఇప్పుడు దానిని పూర్తి చేసి జాతికి అంకితం చేసే బాధ్యత కూడా తనపైనే ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. ఈ ప్రాజెక్టును పూర్తి చేయకుండానే గత పాలకులు కేవలం ప్రారంభోత్సవం చేసి చేతులు దులుపుకొన్నారని ఆయన విమర్శించారు. మార్కాపురం జిల్లా గిద్దలూరు నియోజకవర్గంలోని కృష్ణంశెట్టి పల్లె (కె.ఎస్ పల్లె)లో శనివారం జరిగిన 'సంజీవని' కార్యక్రమ ప్రారంభోత్సవ సభలో ఆయన పాల్గొని ప్రసంగించారు. వెలిగొండ ప్రాజెక్టు అనేది మార్కాపురం, ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లాలకు జీవనాడి వంటిదని, దానిని పూర్తి చేయడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని భరోసా ఇచ్చారు.ప్రాజెక్టు పూర్తికి ఇంకా రూ.3,900 కోట్ల విలువైన పనులు

2లో

నేటి ప్రస్థానం
తెలుగు దినపత్రిక

# వెలిగొండకు నేనే శంకుస్థాపన చేశా..

చేయాల్సి ఉందని చంద్రబాబు వివరించారు. పునరావాసం కింద నిర్వాసితులకు ఇప్పటికే రూ.300 కోట్లు విడుదల చేశామని, త్వరలోనే మరో రూ.600 కోట్లు అందిస్తామని హామీ ఇచ్చారు. మొదటి విడతలో 1.19 లక్షల ఎకరాలకు, ఆ తర్వాత మిగిలిన ప్రాంతానికి పరిహారం చెల్లింపులు పూర్తి చేస్తామని తెలిపారు. కొందరు గొడ్డలి పార్టీకి పరోక్షంగా పనిచేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని, వాటిని నమ్మవద్దని ప్రజలకు సూచించారు.

**ఆగస్టు 15 నుంచి 'సంజీవని'**

ఈ సందర్భంగా రాష్ట్ర ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం రూపొందించిన 'సంజీవని' కార్యక్రమాన్ని చంద్రబాబు ప్రారంభించారు. ఆగస్టు 15 నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తామని ప్రకటించారు. ఇది ఒక సమగ్ర డిజిటల్ ఆరోగ్య వేదిక అని, దీని ద్వారా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి జిల్లా ఆసుపత్రి, సూపర్ స్పెషాలిటీ సేవల వరకు మొత్తం ఆరోగ్య వ్యవస్థను అనుసంధానం చేస్తామని వివరించారు. ప్రెడిక్టివ్, ప్రివెంటివ్, క్యూరేటివ్ విధానాలతో ప్రతి ఒక్కరి ఆరోగ్యాన్ని పర్యవేక్షిస్తామని, సంజీవని కార్డు ద్వారా డిజిటల్ హెల్త్ రికార్డులను భద్రపరుస్తామని తెలిపారు. ప్రజలు కూడా మంచి ఆహారం, వ్యాయామం, యోగా వంటి అలవాట్లతో ఆరోగ్యంగా ఉండాలని పిలుపునిచ్చారు.గంజాయి బ్యాచ్‌లు రాబందుల్లా తిరిగాయి!



గత ఐదేళ్ల పాలనలో రాష్ట్రం రూ.10 లక్షల కోట్ల అప్పుల్లో కూరుకుపోయిందని, వ్యవస్థలన్నీ విధ్వంసానికి గురయ్యాయని చంద్రబాబు ఆరోపించారు. నలుగురు వ్యక్తులు స్వేచ్ఛగా మాట్లాడుకోలేని భయానక వాతావరణం ఉండేదని, బ్లేడు, గంజాయి బ్యాచ్‌లు రాబందుల్లా తిరిగాయని విమర్శించారు. నేడు ఆ పరిస్థితి మారిందని, ప్రజలు స్వేచ్ఛగా ఉన్నారని అన్నారు. రాష్ట్ర పునర్నిర్మాణం కోసమే బీజేపీ, జనసేన, టీడీపీ కూటమిగా ఏర్పడ్డాయని స్పష్టం చేశారు.

మహిళల కోసం స్త్రీ శక్తి పథకం కింద ఉచిత బస్సు ప్రయాణం, దీపం 2.0 వంటి పథకాలను అమలు చేస్తున్నామని, వచ్చే నెలలో 'తల్లికి వందనం' కింద తల్లుల ఖాతాల్లో నిధులు జమ చేస్తామని తెలిపారు.

రైతుల కోసం మొదటి విడత నిధులు ఇప్పటికే విడుదల చేశామని గుర్తుచేశారు.

**యువత, వ్యవసాయంపై ప్రత్యేక దృష్టి**

రామాయపట్నం పోర్టును త్వరలోనే పూర్తి చేసి, పారిశ్రామిక క్లస్టర్లు ఏర్పాటు చేయడం ద్వారా స్థానిక యువతకు ఉద్యోగాలు కల్పిస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాతో పాటు రాయలసీమను హార్టికల్చర్ హబ్‌గా మార్చి, పండ్ల తోటలు, వాణిజ్య పంటలను ప్రోత్సహించేందుకు కార్యాచరణ రూపొందిస్తామన్నారు. రైతులు విచ్చలవిడిగా పురుగుమందులు వాడటం వల్ల మన ఉత్పత్తులు అంతర్జాతీయంగా తిరస్కరణకు గురవుతున్నాయని, అందుకే ప్రకృతి సేద్యం వైపు మళ్లాలని సూచించారు. యువత ఏఐ, క్వాంటం కంప్యూటింగ్ వంటి ఆధునిక టెక్నాలజీలు నేర్చుకొని భవిష్యత్తుకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. జనాభా తగ్గుదల వల్ల భవిష్యత్తులో ఎదురయ్యే సవాళ్లను దృష్టిలో ఉంచుకొని, ఎక్కువ మంది పిల్లలు ఉన్న కుటుంబాలకు ప్రోత్సాహకాలు ఇచ్చే ఆలోచన చేస్తున్నట్లు చంద్రబాబు ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు.ఈ కార్యక్రమంలో మంత్రులు డీబీవీ స్వామి, ఆనం రామనారాయణ రెడ్డి, గొట్టిపాటి రవికుమార్, ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఆర్టీసీ కార్మికుల హామీలను నెరవేరుస్తున్నాం

స్పష్టం చేశారు. శనివారం ఉదయం మీడియాతో మాట్లాడుతూ... 32 డిమాండ్లలో 29 పరిష్కారానికి చర్యలు పూర్తి అయ్యాయన్నారు. 11శాతం పీఆర్సీ జులై జీతాల నుంచే అమలు చేయనున్నట్లు తెలిపారు. గుర్తింపు సంఘాల ఎన్నికలను త్వరలో నిర్వహిస్తామన్నారు. విలీన కమిటీలో కార్మిక ప్రతినిధులకు చోటు కల్పిస్తామని చెప్పారు. గుర్తింపు సంఘం ఎన్నికల తర్వాతే విలీన కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు మంత్రి తెలిపారు. విలీన ప్రక్రియపై ప్రభుత్వం చిత్తశుద్ధితో ముందుకు వెళ్తుందన్నారు. కార్మికులను తప్పుదోవ పట్టించే ప్రచారాలను నమ్మొద్దన్నారు. ఎన్నికల నోడల్ అధికారిగా జేఎల్‌సీ సునీత నియామకం జరిగిందన్నారు. ఏపీ తరహా ఇబ్బందులు రాకుండా విలీన విధివిధానాలను రూపొందించనున్నట్లు మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. ఆర్టీసీ కార్మికులకు ప్రభుత్వం ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తోందని రాష్ట్ర రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. కొంతమంది కార్మిక సంఘాల నాయకులు వాస్తవాలను వక్రీకరిస్తూ కార్మికులను, ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేయడం బాధాకరమని ఆయన అన్నారు. ఆర్టీసీ సమ్మె సందర్భంగా ఉప ముఖ్యమంత్రి భట్టి



విక్రమార్క నేతృత్వంలో మంత్రులు పొన్నం ప్రభాకర్ , శ్రీధర్ బాబు, వివేక్ వెంకటస్వామి, అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌తో లతో కలిసి చీఫ్ సెక్రటరీ రామకృష్ణారావు తో పాటు సీనియర్ ఐఏఎస్ అధికారుల్తు ÷నాన్స్ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్ కుమార్ సుల్తానియా, రవాణా శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ వికాస్ రాజ్, లేబర్ అండ్ ఎంప్లాయిమెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ దానా కిషోర్ , ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి ,ఇతర ఆర్టీసీ ఉన్నతాధికారులు, ప్రతి కార్మిక సంఘం నుంచి ఇద్దరు చొప్పున దాదాపు 30 మంది కార్మిక సంఘాల ప్రతినిధులతో సుదీర్ఘంగా 14 గంటల పాటు చర్చించి అందరి ఆమోదంతో ఏకగ్రీవ నిర్ణయాలు తీసుకున్నామని మంత్రి గుర్తుచేశారు. సమావేశంలో మొత్తం 32 డిమాండ్లలో 29 అంశాలు ఆర్టీసీ యాజమాన్యం పరిధిలో, మూడు అంశాలు ప్రభుత్వ పరిధిలో ఉన్నట్లు నిర్ణయించడం జరిగిందన్నారు. యాజమాన్యం పరిధిలో ఉన్న 29 అంశాల పరిష్కారానికి ఈడి ల కమిటీ ద్వారా ఇప్పటికే చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పరిధిలో ఉన్న మూడు కీలక అంశాలైన ఆర్టీసీ గుర్తింపు సంఘాల ఎన్నికలు, 2021 పీఆర్సీ, ఆర్టీసీ ప్రభుత్వంలో విలీనం.పీఆర్సీ విషయంలో ప్రభుత్వం ప్రకటించిన 11 శాతం జూలై నెల జీతాల నుంచే అమల్లోకి రానుందని తెలిపారు. ఆర్టీసీ కార్మికుల మొదటి డిమాండ్ ఆర్టీసీ గుర్తింపు సంఘాలు ఎన్నికలు అని ఇప్పుడు మాట మార్చి ప్రజలను,కార్మికులను పక్కదోవ పట్టించడం సరికాదన్నారు. ఆర్టీసీ విలీనానికి సంబంధించి విధివిధానాలు రూపొందించే అధికారుల కమిటీలో కార్మిక ప్రతినిధులు తప్పనిసరిగా ఉండాలని సమావేశంలో కార్మికులు ఏకగ్రీవంగా నిర్ణయించారని మంత్రి పేర్కొన్నారు.

# పట్టపగలు ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తారా?

చేయడం దుర్మార్గమని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వాన్ని నడుపుతున్నారా.. లేక గూండాల రాజ్యం నడుపుతున్నారా.. అంటూ సీఎం చంద్రుబాబును నిలదీశారు. పట్టపగలే ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తారా అంటూ మండిపడ్డారు. అమరావతి పేరుతో మీరు చేస్తున్న అవినీతి, దోపిడీ, రైతులపై దౌర్జన్యాలు బయటకు రానీయకుండా ఉండేందుకే ఇలాంటి దారుణాలకు పాల్పడుతున్నారా.. అంటూ సీఎం చంద్రబాబును సూటిగా ప్రశ్నించారు. 'ఇది స్వయంగా మీరు ఉసిగొల్పిన దాడి కాదా? పోలీసులు ఉన్నది భద్రత కల్పించడానికా.. లేక అరాచకాలకు, దాడులకు కాపలా కాయడానికా? ఒకరిద్దరు పోలీసులు దగ్గరుండి ఈ దాడిని సమన్వయం చేయడం అత్యంత దారుణం' అని ఆగ్రహం వ్యక్తం చేశారు. మీరు చేసే దాడులకు వైఎస్సార్‌సీపీ తలవంచదని, మీ అవినీతి, దోపిడీ దౌర్జన్యాలను ఎప్పటికప్పుడు ఎండగడతామని తేల్చి చెప్పారు. రైతులు, బాధితులు ఎప్పుడూ ఒంటరి వాళ్లు కాదని.. వారి పక్షాన వైఎస్సార్‌సీపీ నిలబడి, తోడుగా నిలుస్తుందని భరోసా ఇచ్చారు. ఈ మేరకు శనివారం ఆయన సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో పోస్టు చేశారు. ఆ పోస్టులో వైఎస్ జగన్ ఏమన్నారంటే.. 'చంద్రబాబు గారూ.. మీరు ప్రభుత్వాన్ని నడుపుతున్నారా? లేక గూండాల రాజ్యం నడుపుతున్నారా? రాజధాని రైతుల ఆహ్వానం మేరకు సీఆర్‌డీఏ రైతుల పరిరక్షణ కమిటీతో కలిసి వెళ్తున్న వైఎస్సార్‌సీపీ మాజీ మంత్రులు, ఎమ్మెల్సీలపై దాడులు చేయిస్తారా? పట్టపగలు ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తారా? రైతుల కష్టాలు, అమరావతి పేరుతో మీరు చేస్తున్న అవినీతి, దోపిడీ, రైతులపై దౌర్జన్యాలు బయటకు రానీయకుండా ఉండేందుకు ఇలాంటి దారుణాలు చేస్తారా? ఇది స్వయంగా మీరు ఉసిగొల్పిన దాడి కాదా? పోలీసులు ఉన్నది భద్రత కల్పించడానికా? లేక అరాచకాలకు, దాడులకు కాపలా కాయడానికా? ఒకరిద్దరు పోలీసు అధికారులు దగ్గరుండి ఈ దాడిని కో--ఆర్డినేట్ చేయడం అత్యంత దారుణం. అమరావతి పేరుతో మీరు చేస్తున్న దారుణాలకు బలైపోతున్న రైతులకు తోడుగా నిలవడం తప్పు అవుతుందా? భూములు ఇవ్వని వారిని భూ సేకరణ నోటీసుల పేరుతో వేధించడం, వారి పొలాలకు వెళ్లే మార్గాలను ధ్వంసం చేయడం, ఈ రైతుల పొలాల్లో అక్రమంగా మట్టి తవ్వి దోపిడీ చేస్తున్నారు. ఇంకా దారుణం ఏంటంటే కొండవీటి వాగు నీటిని వారి భూముల్లోకి బలవంతంగా మళ్లించి, గత్యంతరం లేని పరిస్థితులను వారికి కల్పిస్తున్నారు. భూములు ఇవ్వకపోయినా, రిటర్న్‌బుల్ ప్లాట్ల కింద రైతుల పొలాలను, వారి అనుమతి లేకుండానే రిజిస్ట్రేషన్లు చేయిస్తున్నారు. ఇన్ని రకాలుగా నరకయాతనకు గురిచేస్తుంటే, ఆ బాధలు భరించలేక రైతులు కన్నీరు పెడుతుంటే, వారి గోడు వింటూ వారికి భరోసా ఇచ్చే కార్యక్రమం మేం చేస్తుంటే, మీరు మీ వాళ్ల చేత రౌడీయిజం చేయిస్తారా.

## హైదరాబాద్ మెట్రో రైల్ అదనపు ఎండీగా అజిత్ రెడ్డి

ఈ అదనపు బాధ్యతలు అప్పగిస్తూ తెలంగాణ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం అజిత్ రెడ్డి పరిశ్రమలు, వాణిజ్య శాఖ పరిధిలోని 'ఇన్వెస్ట్ తెలంగాణ' చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (సీఈఓ)గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు.2012 బ్యాచ్‌కు చెందిన ఇండియన్ డిఫెన్స్ ఎస్టేట్స్ సర్వీస్ (ఐడీఈఎస్) అధికారి అయిన అజిత్ రెడ్డికి, రాష్ట్రంలోని పలువురు ఐఏఎస్ అధికారుల బదిలీలలో భాగంగా ఈ కొత్త బాధ్యతలు అప్పగించారు. హైదరాబాద్ నగరంలో పట్టణ రవాణా మౌలిక సదుపాయాలను బలోపేతం చేసే క్రమంలో ఈ నియామకం అత్యంత కీలకమైనదిగా భావిస్తున్నారు. ప్రస్తుతం సర్ఫరాజ్ అహ్మద్ హెచ్ఎంఆర్ఎల్ మేనేజింగ్ డైరెక్టర్‌గా కొనసాగుతున్నారు.ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌తో సమావేశమై మెట్రో రైలు విస్తరణపై చర్చించారు. మెట్రో ఫేజ్-1 వాల్యుయేషన్, ఫేజ్-2 విస్తరణ ప్రణాళికల కోసం ఎస్‌బీఐ క్యాపిటల్ మార్కెట్స్ (ఎస్‌బీఐక్యాప్స్)ను కన్సల్టెంట్‌గా నియమించిన నేపథ్యంలో ఈ పరిణామం చోటుచేసుకుంది.

## 1,430కి పెరిగిన మరణాలు

సంఖ్య విపరీతంగా పెరిగే ఆస్కారముందని సహాయక బృందాలు అంచనావేస్తున్నాయి. భూకంప ప్రభావిత ప్రాంతాల్లో యుద్ధ ప్రాతిపదికన గాలింపు చర్యలు చేపడుతున్నారు. భూకంప ఘటనలో 3,238 మంది గాయపడ్డారు. కుప్పకూలిన ఒక భవనం నుంచి ఒక నవజాత శిశువును సహాయక బృందాలు విజయవంతంగా కాపాడాయి. తర్వాత శిశువు తల్లినీ జాగ్రత్తగా బయటకు తీసుకొచ్చారు. భూకంపాల ధాటికి బాధితులుగా మారిన వారి ఆచూకీపై గంట గంటకూ ఆశలు సన్నగిల్లుతున్నాయి. బుధవారం వెనెజువెలాలోని లా గువేరా నగరంలో సంభవించిన భూకంపం ధాటికి భారీస్థాయిలో భవనాలు ధ్వంసంకాగా వాటి శిథిలాల్లో పెద్ద సంఖ్యలో స్థానికులు చిక్కుకున్నట్లు తెలుస్తోంది. శిథిలాల తొలగింపు ప్రక్రియకు తాజాగా అవరోధాలు ఎక్కువయ్యాయి. మళ్లీ భూకంపం రావొచ్చనే భయం స్థానికుల్లో పెరగడంతో ఎక్కువ మంది జనం ఇతర ప్రాంతాలకు తరలిపోవడం, రోజువారీ ట్రాఫిక్ పెరగడంతో సహాయక చర్యలకు తీవ్ర ఆటంకం ఏర్పడుతోంది.

# రాష్ట్ర రోడ్లకు ఇక మహర్దశ

(మొదటి పేజీ తరువాయి)

మోడల్ (హ్యామ్) పద్ధతిలో చేపట్టనున్న ఈ ప్రతిష్టాత్మక రోడ్ల పనులకు 28న నల్గొండ జిల్లా కనగల్ వేదికగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేయనున్నారు. రాష్ట్ర చరిత్రలోనే అత్యంత ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న ఈ మెగా రోడ్డు ప్రాజెక్టు కోసం ప్రభుత్వం సుమారు రూ. 13,006 కోట్ల భారీ బడ్జెట్‌ను కేటాయించింది. దీని ద్వారా రాష్ట్రంలోని అన్ని ప్రధాన ప్రాంతాలను అనుసంధానిస్తూ వేగవంతమైన, సురక్షితమైన , అత్యాధునిక రవాణా సౌకర్యాలను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడమే ప్రధాన లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ మెగా ప్రాజెక్టులో భాగంగా మొదటి విడత కింద రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 6,092 కిలోమీటర్ల మేర విస్తరించి ఉన్న 441 రోడ్లను అభివృద్ధి చేయనున్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల మధ్య రవాణా వ్యవస్థను మెరుగుపరచడంతో పాటు, వాణిజ్య పరంగా కీలకమైన మార్గాలను బలోపేతం చేసేందుకు ఈ నిధులను ఖర్చు చేయనున్నారు. హ్యామ్ విధానం లో చేపట్టడం వల్ల పనులు అత్యంత నాణ్యతతో, నిర్ణీత గడువులోగా పూర్తవుతాయని అధికారులు భావిస్తున్నారు. ప్రయాణ సమయాన్ని తగ్గించడంతో పాటు రోడ్డు ప్రమాదాల నివారణకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తూ ఈ రహదారుల రూపకల్పన జరిగింది. కనగల్‌లో జరిగే ఈ శంకుస్థాపన కార్యక్రమానికి మంత్రులు, ఉన్నతాధికారులు మరియు పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరు కానున్నారు. ఈ పనులు పూర్తయితే తెలంగాణలో మౌలిక వసతుల రంగం సరికొత్త మైలురాయిని అధిగమిస్తుందని, గ్రామీణ ఆర్థిక వ్యవస్థ మరింత బలోపేతం అవుతుందని ప్రభుత్వం ధీమా వ్యక్తం చేస్తోంది.

# నేడు పల్స్ పోలియో

(మొదటి పేజీ తరువాయి)

హైదరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా ఆదివారం నుంచి పల్స్ పోలియో కార్యక్రమం ప్రారంభం కానుంది. 0--5 ఏళ్లలోపు 36.10 లక్షల మంది చిన్నారులకు రెండు చుక్కల బైవేలెంట్ ఓరల్ పోలియో వ్యాక్సిన్ వేయనున్నారు. ఆదివారం బూత్‌లలో, జూన్ 29--30 తేదీల్లో ఇంటింటికీ వెళ్లి మిగిలిపోయిన పిల్లలకు టీకా అందిస్తారు. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్--మల్కాజిగిరి, సంగారెడ్డి జిల్లాల్లో జూలై 1న కూడా కార్యక్రమం కొనసాగుతుంది. ఇందుకోసం రాష్ట్రంలో 22,979 పోలియో బూత్‌లు, 903 మొబైల్ బృందాలు, 104 ట్రాన్సిట్ పాయింట్లను ఏర్పాటుచేశారు. తెలంగాణ 2007 నుంచి పోలియో రహిత రాష్ట్రంగా కొనసాగుతోంది. చివరి పోలియో కేసు సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌లో నమోదైంది. వలస కార్మికులు, ఇటుక బట్టీలు, గిరిజన ప్రాంతాలు, పట్టణ మురికివాడల్లోని చిన్నారులపై ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు ఆరోగ్యశాఖ తెలిపింది. ఐదేళ్లలోపు ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేసింది.

## ముగ్గురు సీఎంల రహస్య సమావేశంలో ఏ ఒప్పందాలు జరిగాయి?: హరీశ్ రావు

ఏ ఒప్పందాలు జరిగాయని బీఆర్ఎస్ కీలక నేత, మాజీ మంత్రి హరీష్ రావు ప్రశ్నించారు. కర్ణాటకలో సీఎంలు, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను కూడా లోపలికి రానీయకుండా నలుగురు మాత్రమే కూర్చుని ఏం చర్చించారో ప్రజలకు స్పష్టంగా చెప్పాలని డిమాండ్ చేశారు. తెలంగాణకు తీవ్ర నష్టం కలిగించేలా కర్ణాటకలో నవేలి, ఆంధ్రప్రదేశ్‌లో గుండ్రేవుల ప్రాజెక్టులు ముందుకు వెళుతుంటే, మన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 'చారిత్రక ఒప్పందం' అంటూ సంబరాలు చేసుకోవడం సిగ్గుచేటని మండిపడ్డారు.గతంలో గుండ్రేవులను బీఆర్ఎస్ ప్రభుత్వం అడ్డుకుందని... కానీ ఇప్పుడు ఏపీ సీఎం తన 'శిష్యుడు' రేవంత్ తెలంగాణ ముఖ్యమంత్రి అయ్యాడనే ధీమాతో మళ్లీ ఆ ప్రాజెక్టును తీసుకురావడం జరుగుతోందని ఆరోపించారు. ఆర్డీఎస్‌కు స్పష్టమైన నీటి కేటాయింపులు ఏమైనా వచ్చాయా అని ప్రశ్నించిన హరీష్ రావు... రేవంత్ రెడ్డికి నీటి వాటాలపై కనీస అవగాహన కూడా లేదని ఎద్దేవా చేశారు. గత 60 ఏళ్లలో కాంగ్రెస్ సగటున 4 టీఎంసీలు మాత్రమే తెచ్చుకుంటే, బీఆర్ఎస్ పాలనలో ప్రతి ఏడాది 44 టీఎంసీల చొప్పున అనుమతులు తెచ్చుకున్నామని గుర్తు చేశారు."మనకు రావాల్సిన 968 టీఎంసీలలో 830 టీఎంసీలకు అనుమతులు తెచ్చుకున్నాం. ఇంకా 138 టీఎంసీలు రావాలి. రేవంత్ రెడ్డి తెలంగాణను ముంచే ముంపు మేస్త్రి కావద్దు" అని వ్యాఖ్యానించారు.

# రేవంత్‌ది అసమర్థ పాలన

కార్యక్రమంలో భాగంగా మహేశ్వరంలో మాజీ మంత్రి సబితాఇంద్రారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ..రాష్ట్రంలో ఏ మూలకు వెళ్లినా.. 'కాంగ్రెస్ పోవాలి...బీఆర్ఎస్ రావాలి'.. కేసీఆర్ ముఖ్యమంత్రి కావాలి' అన్న భావన ప్రజల్లో కనిపిస్తున్నదన్నారు. రాష్ట్రంలో వికాసం పోయి.. విధ్వంసం కొనసాగుతున్నదన్నారు . కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించిందని, బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అమలు చేసిన సంక్షేమ పథకాలను కూడా అమలు చేసే దిక్కులేకుండా పోయిందన్నారు. ఎంతోమంది అమరవీరుల త్యాగాల ఫలితంగా ఏర్పాటైన తెలంగాణ రాష్ట్రంలో విధ్వంస పాలన సాగుతున్నదన్నారు. కేసీఆర్‌కు ప్రజలు పాలన అప్పగిస్తే.. తెలంగాణను ఆయన దేశంలోనే నంబర్‌వన్ స్థానంలో నిలబెట్టారని, రాష్ట్రం రాకెట్ వేగంతో దూసుకుపోయే సమయంలో పొరపాటున తెలంగాణ ద్రోహి రేవంత్‌ను ముఖ్యమంత్రిని చేశారన్నారు. దీంతో రాష్ట్రంలో ప్రగతి పూర్తిగా కనుమరుగైందని, అన్నివర్గాల ప్రజలు కాంగ్రెస్‌పై అసంతృప్తి వెల్లగక్కుతున్నారని చెప్పారు. 420 అబద్ధాలతో ప్రజలను ఆగంచేసి గద్దెనెక్కిన రేవంత్ సంక్షేమ పథకాలన్ని నీరుగార్చారన్నారు.

**యాప్‌లో రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాలు మాయం**

ప్రస్తుతం రాష్ట్రంలో యూరియా షాపుల్లో లేదని, యాప్‌లల్లో ఉందని, ఆ యాప్‌లో రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాలకు స్థానమే లేదన్నారు. రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాలో రేవంత్‌రెడ్డికి రైతులు కనిపించడం లేదా అని కేటీఆర్ ప్రశ్నించారు. రాష్ట్రంలో కరెంటు కోతల కాలం మొదలైందని, బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రైతులకు ఉచితంగా 24 గంటల విద్యుత్ సరఫరా ఇచ్చేదని, ప్రస్తుతం రోజుకు 6 నుంచి 10 సార్ల వరకు కరెంటు పోయి వస్తున్నదన్నారు.

**రైతుబంధు పోయి.. రాహుల్ బంధు వచ్చే..**

రైతు బంధు పోయి.. రాహుల్ బంధు వచ్చిందని కేటీఆర్ అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రైతుబంధు టకాటకా పడేదని.. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో రైతుబంధు ఊసే కనిపించడంలేదని కేటీఆర్ అన్నారు. 70 లక్షల మంది రైతులకు ఏడాదికి రెండుసార్లు బీఆర్ఎస్ ప్రభుత్వం రైతుబంధు ఇచ్చేదని, కాంగ్రెస్ సర్కార్ రైతుబంధును రైతు భరోసాగా మార్చి.. ఒకరిద్దరు రైతులకే ఇస్తున్నదని, రేవంత్ సర్కార్ అసమర్థ పాలన కొనసాగిస్తున్నదన్నారు.

## హస్మత్ పేటలో హైడ్రా కూల్చివేతలు

**హైదరాబాద్:** ఓల్డ్ బోయిన్ పల్లి డివిజన్ పరిధిలోని హస్మత్ పెట్ సర్వే నెంబర్ 1 చత్రిగడ్డలో ఉన్న అక్రమ నిర్మాణాలను హైడ్రా అధికారులు తొలగిస్తున్నారు. గత కొంతకాలంగా ప్రభుత్వ పురావస్తు శాఖకు చెందిన ఈ భూమి కబ్జా చేసి నిర్మాణాలు చేపడుతున్నట్లు ఫిర్యాదులు వెల్లువెత్తడంతో హైడ్రా అధికారులు రంగంలోకి దిగారు. భారీ పోలీసు బందోబస్తు నడుమ చర్యలకు ఉపక్రమించిన హైడ్రా అధికారులు అక్రమ నిర్మాణాలపై ఉక్కు పాదం మోపుతున్నారు.

స్థానిక పోలీసులతో కలిసి హైడ్రా సిబ్బంది జెసిబి ల సహాయంతో కూల్చివేతలు ప్రారంభించారు. 10 ఎకరాలకు పైగా ఉన్న ఈ ప్రభుత్వ భూమిని అక్రమార్కులు కబ్జా చేసి నోటరీ ప్లాట్ల పేరుతో విక్రయాలు చేస్తున్నారని తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు పహారా ఏర్పాటు చేసి అక్రమ నిర్మాణాలను నేలమట్టం చేస్తున్నారు. అక్రమ నిర్మాణాల తొలగింపు పూర్తయిన వెంటనే కంచె ఏర్పాటు చేసి ఈ భూమిని హైడ్రా అధికారులు స్వాధీనం చేసుకోనున్నారు. ప్రభుత్వ స్థలాలు చెరువులను ఆక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని హైడ్రాధికారులు హెచ్చరిస్తున్నారు. ఇలాంటి ప్రభుత్వ స్థలమని ప్రభుత్వ నోటీస్ పెట్టి ట్రెస్పాస్ బోర్డు ఏర్పాటు చేశారు. బాధితులు ఎంత వేడుకున్న ఆర్డీవో ఆఫీస్ వెళ్లి కలవండని అధికారులు చెప్పడంతో, ఏమి చేయాలో తెలియక బాధితులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## రెండు కార్లు ఒకదానిని మరొకటి ఢీ

### ముగ్గురు మృతి, మరో ముగ్గురికి గాయాలు

కడప: కడప రింగ్ రోడ్డు లోని పాలెంపల్లి క్రాస్ వద్ద రోడ్డు ప్రమాదం జరిగింది. రెండు కార్లు ఒకదానికి ఒకటి ఢీకొన్నాయి. ఘటనలో ముగ్గురు మృతి చెందారు. మరో ముగ్గురికి గాయాలు అయ్యాయి. మృతులు తిరుపతి పట్టణం జీవకోనకు చెందిన హర్షవర్ధన్(27) కిషోర్(28) సుధీర్ కుమార్ రెడ్డి(24 )గా గుర్తించారదు. తిరుపతి నుండి హైదరాబాదుకు వెళుతున్న కారును ఎదురుగా వస్తున్న మరో కారు ఢీకొనడంతో ప్రమాదం జరిగింది. షిఫ్ట్ కారులో ప్రయాణిస్తున్న ముగ్గురు మృతి చెందగా ఎర్టిగా కారులో బెలూన్స్ ఓపెన్ కావడంతో ప్రయాణికులు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. చెన్నూరు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని విచారిస్తున్నారు.

## గాదె సాయికృష్ణ లాకప్ డెత్ కేసులో కొనసాగుతున్న సిట్ దర్యాప్తు

**విజయవాడ:** కృష్ణలంక పోలీసు స్టేషన్ లో మృతి చెందిన గాదె సాయి కృష్ణ కేసులో సిట్ దర్యాప్తు కొనసాగుతోంది. సిట్ అధికారులు లి పలు కోణాల్లో దర్యాప్తు చేపట్టారు. పరారీలో ఉన్న హెడ్ కానిస్టేబుళ్లు, సీఐ నాగరాజు సన్నిహితుడు సురేష్ ఆచూకీ కోసం హైదరాబాద్, బెంగళూరులో స్పెషల్ టీమ్స్ గాలిస్తున్నాయి. ఇప్పటికే అశోక్, నాని సిట్ ఇళ్లకు వెళ్లి నోటీసులు ఇచ్చింది. సాయికృష్ణ అదృశ్యంలో కీలక సమాచారం ఈ ముగ్గురికి తెలుసని సిట్ అధికారులు భావిస్తున్నారు.

## సత్యదేవుని సేవలో దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని

ప్రముఖ పుణ్యక్షేత్రం అన్నవరం శ్రీ సత్యనారాయణ స్వామి వారిని శనివారం ఉదయం దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయానికి విచ్చేసిన దెందులూరు ఎమ్మెల్యేకి ఆలయ అధికారులు ఆధ్వర్యంలో ఘనస్వాగతం పలికారు అనంతరం ఆలయ మండపంలో అర్చకులు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ కి స్వామి వారి శేష వస్త్రాన్ని అందించి వేద ఆశీర్వచనం, తీర్థ ప్రసాదాలు అందించారు..

## రైతుల పక్షపాతికి భూ నిర్వాసితుల గోస కనిపిస్తలేదా

### బీఆర్ఎస్ నాయకురాలు దాసరి ఉష

**పెద్దపల్లి:** రైతుల పక్షపాతిగా చెప్పుకునే ఎమ్మెల్యే విజయ రమణ రావుకు భూ నిర్వాసితుల గోస కనిపిస్తలేదా అంటూ బీ ఆర్ఎస్ నాయకురాలు దాసరి ఉష ప్రశ్నించారు. ఈ సందర్భంగా ఆమె మండలంని పెద్దకల్వల గ్రామం వద్ద ప్రతిపాదిత బైపాస్ రోడ్డు నిర్మాణం పనులను రైతులు అడ్డుకోవడం ఇప్పుడు తీవ్ర వివాదాస్పదంగా మారింది. అధికారులు రైతులను సంప్రదించకుండా,ఏకపక్షంగా వ్యవసాయ భూముల్లో మార్కింగ్‌లు వేయడాన్ని బీఆర్ఎస్ నాయకురాలు దాసరి ఉష తీవ్రంగా ఖండించారు. ఆందోళన చేస్తున్న భూ నిర్వాసిత రైతులకు ఆమె సంఘీభావం ప్రకటించారు. గతంలో గ్రామ ప్రజాప్రతినిధికి చెందిన స్థలానికి సమీపంగా బైపాస్ రోడ్డు ఉండాలని నిర్ణయించిన ప్పటికీ,తాజాగా ప్రణాళికను మార్చి, చిన్న, సన్నకారు రైతుల సారవంత మైన వ్యవసాయ భూముల మీదుగా రోడ్డును మళ్లించడం వెనుక పెద్ద కుట్ర ఉందని దాసరి ఉష ఆరోపించారు. ముందస్తు సమాచారం ఇవ్వకుండా, హడావుడిగా ఎర్రజెండాలు పాతడం వెనుక అధికార పార్టీ నేతల స్వార్థం దాగి ఉందని ఆమె మండిప డ్డారు. ఈ సందర్భంగా దాసరి ఉష మాట్లాడుతూ రైతుల పొట్ట కొట్టి,వారి భూములను లాక్కోవాలని చూడటం దుర్మార్గమని,ఒక రైతుకు మూడు ఎకరాల వరకు భూమి పోయే పరిస్థితి ఉంటే, ఆ కుటుంబాలు రోడ్డున పడతాయని, దాదాపు 15 ఎకరాల సారవంతమైన భూమి ఈ సర్వే వల్ల నాశనమవుతోంది. కొందరు బడా వ్యక్తుల అక్రమ కట్టడాలను కాపాడటం కోసమే పేద రైతుల భూములను బలి ఇస్తారా అంటూ ప్రశ్నించారు. భూ రికార్డులను సమగ్రంగా పరిశీలించకుండా,రైతుల అనుమతి లేకుండా చేసే సర్వేలను వెంటనే నిలిపివే యాలన్నారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్, స్థానిక ప్రజా ప్రతినిధులు స్పందించి, భూ నిర్వాసిత రైతులకు తగిన న్యాయం చేయాలని కోరారు. రైతుల సమస్యను పట్టించు కోకుండా,బలవంతంగా భూసేకరణకు ప్రయత్నిస్తే రైతుల సమస్య పరిష్కారమ య్యే వరకు వారి పోరాటానికి పూర్తి మద్దతు ఇస్తామని, అవసరమైతే పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని ఆమె స్పష్టం చేశారు.

## కుల రాజకీయాలకు పాల్పడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

అనకాపల్లి: ఎలమంచిలి నియోజకవర్గంలోని మునగపాక జనసేన పార్టీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఎలమంచిలి శాసనసభ్యులు సుందరపు విజయ్ కుమార్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ మాట్లాడుతూ, విజయవాడలో సాయి అనే యువకుడి ఘటనను రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగించుకుంటూ వైఎస్సార్‌సీపీ నాయకులు కుల రాజకీయాలకు పాల్పడుతున్నారని విమర్శించారు.ముఖ్యంగా పేర్ని నాని, అంబటి రాంబాబు తమ పార్టీ నాయకుడు, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్పై మీడియా సమావేశాల్లో అసత్య ఆరోపణలు చేస్తున్నారని ఆరోపించారు.

# కాటేస్తున్న కాలుష్యం.. కరిగిపోతున్న జీవితాలు

### జవహర్‌నగర్ డంపింగ్ యార్డు నీడలో 20 గ్రామాల ప్రజల నరకయాతన



హైదరాబాద్, జూన్ 28 అభివృద్ధి చెందిన నగరంగా హైదరాబాద్ గుర్తింపు పొందుతున్నా.. అదే నగర శివారులో వేలాది కుటుంబాలు విషపు గాలిని పీలుస్తూ, కలుషిత నీటిని తాగుతూ నిత్యం అనారోగ్యంతో పోరాడుతున్నాయి. జవహర్‌నగర్ డంపింగ్ యార్డు పరిసరాల్లో నివసిస్తున్న ప్రజలకు ప్రతి రోజు జీవితం ఓ యుద్ధంగా మారింది. దుర్వాసన, ఈగలు, దోమలు, కాలుష్యం, కలుషిత భూగర్భ జలాలు వారి జీవితాలను అతలాకుతలం చేస్తున్నాయి.

**దుర్వాసనతో నరకం... రోగాలతో పోరాటం**

జవహర్‌నగర్ డంపింగ్ యార్డులో రోజుకు దాదాపు లి10 వేల మెట్రిక్ టన్నుల చెత్తలి డంప్ అవుతోంది. దీంతో పరిసర ప్రాంతాల్లో దుర్వాసన తీవ్రంగా వ్యాపిస్తోంది. గాలి కాలుష్యం, నీటి కాలుష్యం కారణంగా కలరా, టైఫాయిడ్, మలేరియా, డెంగ్యూ, అలర్జీలు, చర్మవ్యాధులు, శ్వాసకోశ సమస్యలు విపరీతంగా పెరుగుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పిల్లలు, వృద్ధులు ఎక్కువగా శ్వాసకోశ వ్యాధుల బారిన పడుతున్నారని, ప్రతి ఇంట్లో ఎవరో ఒకరు అనారోగ్యంతో బాధపడుతున్నారని గ్రామస్థులు చెబుతున్నారు.

**కలుషితమైన భూగర్భ జలాలు**

డంపింగ్ యార్డు ప్రభావంతో భూగర్భ జలాలు కూడా కలుషితమవుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. బోర్లలో పసుపు రంగు నీరు వస్తోందని, దుర్వాసన కారణంగా ఆ నీటిని ఉపయోగించలేక తాగునీటిని కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని వాపోతున్నారు.

**సంపాదనంతా ఆస్పత్రులకే**

రోజూ కష్టపడి సంపాదించే డబ్బులో ఎక్కువ భాగం వైద్య ఖర్చులకే వెళ్తోందని బాధిత కుటుంబాలు చెబుతున్నాయి. కాలుష్యం కారణంగా తరచూ అనారోగ్యానికి గురవుతుండటంతో కుటుంబాల ఆర్థిక పరిస్థితి దెబ్బతింటోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**ఇళ్లు అమ్మాలన్నా కొనేవారు లేరు**

కాలుష్యం తీవ్రతతో జవహర్‌నగర్ పరిసర ప్రాంతాలకు బంధువులు రావడానికి కూడా వెనుకాడుతున్నారని స్థానికులు చెబుతున్నారు. ఇళ్లను విక్రయించి వేరే ప్రాంతానికి వెళ్లాలని ప్రయత్నించినా కొనుగోలు చేసేవారు ముందుకు రావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**20 గ్రామాలపై ప్రభావం**

జవహర్‌నగర్ డంపింగ్ యార్డు ప్రభావం దాదాపు లి20 గ్రామాలపైలి పడుతోందని స్థానికులు చెబుతున్నారు. కార్మిక్‌నగర్, బండ్లగూడ, దమ్మాయిగూడతో పాటు పలు గ్రామాల్లో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

**నిబంధనలు పాటించడం లేదన్న ఆరోపణలు**

డంపింగ్ యార్డును నిర్వహిస్తున్న సంస్థ చెత్త నిర్వహణలో పర్యావరణ నిబంధనలను పూర్తిగా పాటించడం లేదని బాధితులు ఆరోపిస్తున్నారు. రీసైక్లింగ్ ప్రక్రియ మందగించడం వల్ల చెత్త గుట్టలుగా పేరుకుపోతోందని, దాంతో కాలుష్యం మరింత పెరుగుతోందని పేర్కొంటున్నారు.

**వైద్యుల హెచ్చరిక**

కాలుష్యభరితమైన గాలి, కలుషిత నీరు, దుర్వాసన కారణంగా శ్వాసకోశ వ్యాధులు, చర్మవ్యాధులు, అలర్జీలు, టైఫాయిడ్, మలేరియా వంటి వ్యాధులు పెరిగే ప్రమాదం ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. దీర్ఘకాలంగా ఇలాంటి వాతావరణంలో జీవించడం వల్ల రోగనిరోధక శక్తి తగ్గి దీర్ఘకాలిక వ్యాధులు వచ్చే అవకాశం ఉందని సూచిస్తున్నారు.

కాలుష్యం, దుర్వాసన సమస్యపై ఎన్నిసార్లు అధికారులకు, ప్రజాప్రతినిధులకు వినతులు అందించినా పరిష్కారం కనిపించడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డంపింగ్ యార్డులో శాస్త్రీయ పద్ధతిలో చెత్త నిర్వహణ చేపట్టాలని, కాలుష్య నియంత్రణ చర్యలు వెంటనే అమలు చేయాలని, ప్రభావిత గ్రామాల ప్రజలకు ఆరోగ్య రక్షణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు.

**బాధితుల గళం**

- 'ప్రతి రోజు దుర్వాసన భరిస్తూ జీవిస్తున్నాం. పిల్లలు తరచూ అనారోగ్యానికి గురవుతున్నారు. ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలి."లి -- స్థానికులు
- 'కాలుష్యంతో బోర్ల నీళ్లు కూడా వాడలేని పరిస్థితి. తాగునీరు కొనుగోలు చేయాల్సి వస్తోంది."లి -- దమ్మాయిగూడ గ్రామస్థులు
- 'డంపింగ్ యార్డు నిర్వహణలో నిబంధనలు పాటించి, కాలుష్యాన్ని నియంత్రించకపోతే ప్రజారోగ్యంపై మరింత తీవ్ర ప్రభావం పడే ప్రమాదం ఉంది."లి -- వైద్య నిపుణులు

## నీళ్ల మంత్రి ఉత్తమ్‌ను బయటే ఉంచి సీఎంల సమావేశం.. ఏం చర్చించారో చెప్పాలి: హరీశ్ రావు



**హైదరాబాద్, జూన్ 28 (నేటి ప్రస్తనం):** తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల ముఖ్యమంత్రుల సమావేశంలో తెలంగాణ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిని బయట కూర్చోబెట్టడంపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. సమావేశంలో జరిగిన చర్చల పూర్తి వివరాలను రాష్ట్ర ప్రజల ముందుంచాలని ఆయన డిమాండ్ చేశారు.తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో హరీశ్ రావు మాట్లాడుతూ, మూడు రాష్ట్రాల ముఖ్యమంత్రుల సమావేశంలో తెలంగాణ నీటిపారుదల శాఖ మంత్రి, రాష్ట్ర ఇంజినీర్లు, ఈఎన్‌సీకి కూడా అవకాశం ఇవ్వకుండా బయట ఉంచడం వెనుక ఉన్న కారణం ఏమిటని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రయోజనాలకు సంబంధించిన కీలక అంశాలపై రహస్యంగా గంటసేపు ఏం చర్చించారో ప్రభుత్వం వెల్లడించాలని కోరారు.తెలంగాణ హక్కులకు సంబంధించిన అంశాల్లో ప్రభుత్వం ఏ మేరకు రాష్ట్ర ప్రయోజనాలను కాపాడిందో ప్రజలకు వివరించాలని ఆయన అన్నారు. ముఖ్యంగా ఆర్డీఎస్ ప్రాజెక్టు ద్వారా తెలంగాణకు రావాల్సిన లి15.9 టీఎంసీల నీటిలి అంశాన్ని సమావేశంలో ప్రస్తావించారా లేదా అనే విషయాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు.అలాగే తుంగభద్ర నదిపై కర్ణాటక ప్రభుత్వం నిర్మిస్తున్న మూడు బ్యారేజీల వల్ల తెలంగాణకు నష్టం జరిగే అవకాశం ఉందని హరీశ్ రావు ఆందోళన వ్యక్తం చేశారు. ఆ బ్యారేజీల నిర్మాణాన్ని అడ్డుకునే విషయంలో తెలంగాణ ప్రభుత్వం ఎలాంటి హామీ తీసుకుందో వెల్లడించాలని కోరారు.కర్ణాటక ప్రభుత్వం బ్యారేజీల నిర్మాణానికి అభ్యంతరం చెప్పవద్దంటూ తెలంగాణ ప్రభుత్వానికి లేఖ రాసిందని, అయితే ఏడాది గడిచినా తెలంగాణ ప్రభుత్వం అధికారికంగా అభ్యంతరాలు వ్యక్తం చేయకపోవడం ఆందోళన కలిగించే విషయమని హరీశ్ రావు విమర్శించారు.

## ఏపీ ఎయిర్‌పోర్టుల్లో మద్యం అమ్మకాలకు గ్రీన్ సిగ్నల్.. తిరుపతికి మినహాయింపు

**ఏపీ విమానాశ్రయాల్లో మద్యం అమ్మకాలకు అనుమతి**

**ఆధ్యాత్మిక నగరం తిరుపతి ఎయిర్‌పోర్టుకు మినహాయింపు ఇస్తూ ఉత్తర్వులు**

**24 గంటల పాటు బార్లు, వైన్ షాపుల నిర్వహణకు అవకాశం**

**భారీ ఫీజులతో కొత్త ఎక్సైజ్ విధానాన్ని ప్రకటించిన ప్రభుత్వం**

**మూడేళ్ల తర్వాత ఈ విధానంపై సమీక్షించనున్న సర్కార్**

ఆంధ్రప్రదేశ్‌లోని విమానాశ్రయాల్లో మద్యం అమ్మకాలకు రాష్ట్ర ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. ఎయిర్‌పోర్టుల ప్రాంగణాల్లో బార్లు, వైన్ షాపులు ఏర్పాటు చేసేందుకు అనుమతిస్తూ శనివారం అధికారికంగా ఉత్తర్వులు జారీ చేసింది. అయితే, ఆధ్యాత్మిక కేంద్రమైన తిరుపతిలోని విమానాశ్రయానికి ఈ ఉత్తర్వుల నుంచి మినహాయింపు ఇస్తున్నట్లు ప్రభుత్వం స్పష్టం చేసింది.ప్రభుత్వం జారీ చేసిన కొత్త మార్గదర్శకాల ప్రకారం, విమానాశ్రయాల్లోని బార్లు, వైన్ షాపులు 24 గంటలూ పనిచేసేందుకు అనుమతి కల్పించారు. ఈ కొత్త విధానంలో భాగంగా ప్రభుత్వం లైసెన్స్ ఫీజులు, ఎక్సైజ్ సుంకాన్ని కూడా ఖరారు చేసింది. ఎయిర్‌పోర్టులో బార్ లైసెన్స్ కోసం దరఖాస్తు ఫీజు రూ.5 లక్షలు, వైన్ షాపు కోసం దరఖాస్తు ఫీజు రూ.2 లక్షలుగా నిర్ణయించారు.ఇక ఎక్సైజ్ సుంకం విషయానికొస్తే, విమానాశ్రయంలోని వైన్ షాపుకు ఏటా రూ.2 కోట్లుగా నిర్ణయించారు. బార్లకు ప్రయాణికుల రద్దీ ఆధారంగా ఎక్సైజ్ సుంకాన్ని రెండు రకాలుగా విభజించారు. ఏడాదికి 20 లక్షలకు పైగా ప్రయాణికుల రాకపోకలు ఉన్న విమానాశ్రయాల్లోని బార్లకు రూ.25 లక్షలు, 20 లక్షల లోపు ప్రయాణికులు ఉన్నచోట రూ.15 లక్షలుగా ఎక్సైజ్ సుంకాన్ని నిర్ధారించారు. ఈ కొత్త ఎక్సైజ్ విధానాన్ని మూడేళ్ల తర్వాత సమీక్షించనున్నట్లు ప్రభుత్వం తన ఉత్తర్వుల్లో పేర్కొంది.

## ఫేస్‌బుక్ కామెంట్‌పై భూమన అనుచరులు కిడ్నాప్ చేశారని బాధితుడి ఆరోపణ


**నాలుక కోసి, నరాలు కట్ చేసి చంపేందుకు యత్నించారని ఫిర్యాదు**

**సజ్జల ఫోన్‌తో నిందితులకు స్టేషన్ బెయిల్ ఇచ్చారని ఆవేదన**

**తనపైనే అక్రమ కేసులు పెట్టి, కుటుంబాన్ని వేధించారని ఆరోపణ**


ఫేస్‌బుక్‌లో పెట్టిన ఓ కామెంట్‌కు ప్రతిగా తనను కిడ్నాప్ చేసి, చంపేందుకు ప్రయత్నించారని ఆరోపిస్తూ ఓ బాధితుడు ప్రస్తుత హోంమంత్రి వంగలపూడి అనితకు ఫిర్యాదు చేశారు. వైఎస్ఆర్ కడప జిల్లా రాజంపేట మండలం మన్నూరు గ్రామానికి చెందిన పత్తి మణి, మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన ప్రజావినతుల స్వీకరణ కార్యక్రమంలో హోంమంత్రితో పాటు టీడీపీ జాతీయ ఉపాధ్యక్షులు ఎం.డి. నజీర్‌కు తన గోడును విన్నవించారు.బాధితుడు పత్తి మణి తెలిపిన వివరాల ప్రకారం, 2023 జూన్ 9న నాటి తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకర్ రెడ్డి కుమారుడు అభినయ్ రెడ్డి, “నారా లోకేశ్, పవన్ కల్యాణ్‌లను తిరుపతిలో అడుగుపెట్టనివ్వం” అని ఫేస్‌బుక్‌లో పోస్ట్ చేశారు. దీనిపై స్పందించిన తాను.. “ఇది రాచరిక పాలన కాదు, ప్రజాస్వామ్యం. ఎవరైనా ఎక్కడి నుంచైనా పోటీ చేయవచ్చు... మీరు నందలూరు నుంచి తిరుపతి వెళ్లలేదా?” అని కామెంట్ పెట్టినట్టు వెల్లడించారు. ఈ కామెంట్‌ను మనసులో పెట్టుకున్న భూమన అనుచరుడు రాజు మరికొందరితో కలిసి జూన్ 11న రాజంపేటలోని హరిత హోటల్ వద్ద తనపై దాడి చేసి, బలవంతంగా కారులో కిడ్నాప్ చేశారని మణి ఆరోపించారు.

నేటి ప్రస్థానం
తెలుగు దినపత్రిక




# పులి-మేకతో రోజా రీ ఎంట్రీ

సీనియర్ నటి, ఫైర్ బ్రాండ్ రోజా సెల్వమణి ఒకప్పుడు తెలుగు, తమిళ్ ఇండస్ట్రీల్లో తనకంటూ ఒక ప్రత్యేకమైన గుర్తింపు తెచ్చుకున్న రోజా.. రాజకీయాల్లోకి వచ్చాకా సినిమాలు తగ్గించారు. ఇక తాజాగా రోజా తమిళ్ సినిమాలో రీఎంట్రీ ఇచ్చారు. దాదాపు 12 ఏళ్ళ తరువాత ఆమె నటిస్తోన్న చిత్రం లెనిన్ పాండియన్. ఈ సినిమా తెలుగులో పులి మేక అనే పేరుతో రిలీజ్ కానుంది. డి.డి. బాలచంద్రన్ దర్శకత్వం వహిస్తోన్న ఈ చిత్రానికి మ్యూజిక్ మ్యాస్ట్రో ఇళయరాజా సంగీతం అందించారు. ఈ చిత్రంలో గంగై అమరన్, దర్శన్ గణెళిశన్ కీలక పాత్రల్లో నటించారు. ఇప్పటికే పులి మేక చిత్రం నుంచి రిలీజైన పోస్టర్స్, టీజర్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. తాజాగా ఈ సినిమా తెలుగు ట్రైలర్ ని మేకర్స్ రిలీజ్ చేశారు. ట్రైలర్ ఆద్యంతం ఆకట్టుకుంటుంది. ఈ చిత్రం గ్రామీణ నేపథ్యం, రాజకీయాలు, మరియు పోలీసు వ్యవస్థ చుట్టూ తిరిగే ఒక పవర్‌ఫుల్ సామాజిక డ్రామాగా రూపొందింది. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి దశాబ్దాలు గడిచినా ఒక సామాన్య రైతు స్వేచ్ఛగా జీవించలేకపోతున్నాడనే బలమైన సంభాషణతో ఈ ట్రైలర్ మొదలయ్యింది. ఇంకోపక్క కానిస్టేబుల్ గా హీరో ఎన్ని అవమానాలు పడుతున్నాడో చూపించారు. పోలీస్ స్టేషన్లలో కానిస్టేబుళ్లపై జరిగే అణిచివేత, ఉన్నతాధికారుల అహంకారం, మరియు మట్టి మాఫియా వల్ల గ్రామీణ ప్రాంతాల్లో జరుగుతున్న అన్యాయాలను కళ్ళకు కట్టినట్లు చూపించారు. చట్టం, న్యాయం, మరియు అధికార దుర్వినియోగానికి వ్యతిరేకంగా జరిగే పోరాటమే ఈ సినిమా కథగా తెలుస్తోంది. ఇక ఈ చిత్రంలో రోజా ఒక వయస్సు మళ్ళిన మహిళగా కనిపించారు. మరి ఈ చిత్రంతో రోజా రీఎంట్రీ ఎలా ఉండబోతుందో చూడాలి.



# తిరైకథై మన్నన్

'తిరైకథై మన్నన్'... అంటే 'స్క్రీన్‌ప్లే చక్రవర్తి'గా ఖ్యాతి పొందిన ఆ మహా దర్శకుడి గుండె జూన్ 27, 2026న చెన్నైలో ఉదయం ఆరు గంటలకు ఆగిపోయింది. ఆ గుండె 49 ఏళ్లుగా తమిళ సినిమా గుండెచప్పుడైంది. కె.భాగ్యరాజా... మన భాగ్యరాజా గురువు భారతీరాజా వెళ్లిపోయిన 17 రోజులకే ప్రయాణం కట్టాడు. ఇది యాదృచ్ఛికం కాదు. విధి రాసిన స్క్రీన్‌ప్లే. భాగ్యరాజా కథలో అయితే ఇదే అత్యంత బలమైన, అత్యంత బాధాకరమైన క్లైమాక్స్. భారతీయ సినీ ప్రేక్షకులకు సిసలైన దేశీయ వినోదభాగ్యం అందించిన కె. భాగ్యరాజా ఒక మనిషి కాదు... యూనివర్సిటీ. దర్శకుడు, రచయిత, నటుడు, సంగీత దర్శకుడు, నిర్మాత, ఎడిటర్, పత్రికా సంపాదకుడు. అన్నిటి కంటే ముందు అతనొక కథకుడు. కాగితం అందుకుని రెండు లైన్లు రాస్తే చాలు థియేటర్ దద్దరిల్లాల్సిందే. కథ అల్లితే బుకింగ్స్ కిటకిటలాడాల్సిందే. అందుకే సౌత్ సినిమా కె. భాగ్యరాజాను 'కింగ్ ఆఫ్ స్క్రీన్ ప్లే' అని, 'తిరైకథై మన్నన్' అని శిరస్సు వంచి అంగీకరించింది. 1977... '16 వయదినిలే' షూటింగ్. భారతీరాజా డైరెక్టర్. భాగ్యరాజా అసిస్టెంట్. పల్లెటూరికి వచ్చిన డాక్టర్ కుట్రతో శ్రీదేవిని లోబరుచుకునే కీలక సీన్ తీస్తున్నాడు భారతీరాజా. భాగ్యరాజా గురువు దగ్గరకు వెళ్లి గుసగుసగా అన్నాడు... 'సార్, ఇక్కడ ఒక కొబ్బరికాయ విజువల్ పెడితే?'.... లోపల అమాయకురాలి జీవితం నాశనమవుతోందనడానికి సింబాలిక్‌గా బయట పచ్చటి కొబ్బరికాయను చెక్కుతున్న విజువల్.

# దర్శకుడు సంపదీప్ రెడ్డి సమర్పణలో రోమాచంకం

అర్జున్ రెడ్డి', 'యానిమల్' చిత్రాలతో సంచలన విజయాలను అందుకున్న స్టార్ డైరెక్టర్ సందీప్ రెడ్డి వంగా సరికొత్త అవతారంలో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాడు. టాలీవుడ్ యువ నటులు సుమంత్ ప్రభాస్, అనంతిక సనిల్‌కుమార్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న తాజా చిత్రం 'రోమాంచకం'. ఈ క్రేజీ ప్రాజెక్ట్‌ను సందీప్ సమర్పించబోతున్నాడు. ఈ సందర్భంగా సినిమాకు సంబంధించిన ఫస్ట్ లుక్ పోస్టర్‌ను సందీప్ రెడ్డి వంగా సోషల్ మీడియా ద్వారా విడుదల చేశారు. ఈ సందర్భంగా సినిమాపై తనకున్న ప్రేమను వ్యక్తపరుస్తూ ఒక ఎమోషనల్ నోట్ కూడా రాసుకొచ్చారు. చలనచిత్ర పరిశ్రమలో పంపిణీదారుగా తనకు ఇది మొదటి ప్రాజెక్ట్ అని వెల్లడించారు. కథ వింటున్నంత సేపూ తాను ఎంతగానో నవ్వుకున్నానని, ఈ వినోదం వెనుక ఒక బలమైన ఎమోషన్ కూడా దాగి ఉందని ఆయన పేర్కొన్నారు. భద్రకాళి పిక్చర్స్ బ్యానర్‌పై ఎంతో వైవిధ్యమైన మ్యూజికల్ రొమాంటిక్ కామెడీ చిత్రంగా ఈ 'రోమాంచకం' సినిమా రాబోతోందని ఆయన సంతోషాన్ని వ్యక్తం చేశారు.






# కరిష్మాకపూర్ తాజా వెబ్ సీరిస్ బ్రౌన్



బాలీవుడ్ సీనియర్ నటి కరిష్మా కపూర్ ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా వెబ్ సిరీస్ 'బ్రౌన్'. ఈ సిరీస్ ట్రైలర్‌ను మేకర్స్ తాజాగా విడుదల చేశారు. ఈ ట్రైలర్ చూస్తుంటే.. సిరీస్ కోల్‌కతా నేపథ్యంలో సాగే ఒక సైకలాజికల్ క్రైమ్ థ్రిల్లర్ అని తెలుస్తుంది. ఒకప్పుడు నగరంలోనే అత్యుత్తమ పోలీసు అధికారిణిగా పేరు తెచ్చుకుని ఆ తర్వాత జరిగిన కొన్ని సంఘటనల వల్ల మానసిక క్షోభను అనుభవిస్తూ, మద్యానికి బానిసైన రీటా బ్రౌన్ (కరిష్మా కపూర్) అనే ఆఫీసర్ చుట్టూ ఈ కథ తిరుగుతుంది. నగరంలో ఒక ప్రముఖ వ్యాపారవేత్త కుమార్తె దారుణ హత్యకు గురికావడంతో, ఈ కేసును దర్యాప్తు చేయడానికి రీటా బ్రౌన్ మళ్లీ విధుల్లోకి రావలసి వస్తుంది. ఈ క్రమంలో ఆమె తన జూనియర్ ఆఫీసర్ ఇన్‌స్పెక్టర్ అర్జున్ (సూర్య శర్మ)తో కలిసి విచారణను ప్రారంభిస్తుంది. ఈ కేసును ఛేదించే పక్రియలో వారు తమ వ్యక్తిగత జీవితంలోని బాధలను, గతాన్ని ఎలా ఎదుర్కొన్నారనేదే ఈ సిరీస్ కథాంశం. ఈ సిరీస్ గురించి కరిష్మా కపూర్ మాట్లాడుతూ, రీటా బ్రౌన్ పాత్ర నేను ఇప్పటివరకు పోషించిన పాత్రల కంటే పూర్తి భిన్నమైనది.

# రికార్డులు తిరగరాస్తున్న కరుప్ప

**300 కోట్ల వసూళ్లను దాటిన మూవీ**



తమిళ స్టార్ హీరో సూర్య మరోసారి తన స్టార్ పవర్‌ను బాక్సాఫీస్ వద్ద నిరూపించారు. టాలెంటెడ్ దర్శకుడు ఆర్జే బాలాజీ దర్శకత్వంలో తెరకెక్కిన 'కరుప్పు' చిత్రం విడుదలైన తొలి రోజు నుంచే ప్రేక్షకులను ఆకట్టుకుంటూ విజయవంతమైన ప్రస్థానాన్ని కొనసాగిస్తోంది. డివైన్ ఎలిమెంట్స్, కమర్షియల్ అంశాలు, భావోద్వేగాలతో రూపొందిన ఈ చిత్రం ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా అత్యంత ప్రతిష్టాత్మకమైన రూ.300 కోట్ల గ్రాస్ కలెక్షన్ల మైలురాయిని అధిగమించి కొత్త రికార్డు సృష్టించింది. సినిమా విడుదలైనప్పటి నుంచి అన్ని ప్రాంతాల్లోనూ అద్భుతమైన స్పందన లభిస్తోంది. ముఖ్యంగా సూర్య పవర్‌ఫుల్ స్క్రీన్ ప్రెజెన్స్, ఎమోషనల్ పర్ఫార్మెన్స్, యాక్షన్ సీక్వెన్స్‌లు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. దీంతో కుటుంబ ప్రేక్షకులు, యువత, మాస్ ఆడియన్స్ నుంచి సమానమైన ఆదరణ లభిస్తోంది. 'కరుప్పు' కథలోని ఆధ్యాత్మిక నేపథ్యం, భారీ స్థాయి విజువల్ ట్రీట్, కమర్షియల్ ఎలిమెంట్స్ సమతుల్యత సినిమాకు ప్రధాన బలాలుగా నిలిచాయి. ప్రేక్షకులను ఆరంభం నుంచి క్లైమాక్స్ వరకు ఆసక్తిగా కట్టిపడేసే విధంగా దర్శకుడు ఆర్జే బాలాజీ కథను తెరకెక్కించారని సినీ విశ్లేషకులు ప్రశంసిస్తున్నారు. సినిమా విజయంలో సాంకేతిక విభాగం పాత్ర కూడా కీలకమైంది. యువ సంగీత దర్శకుడు సాయి అభ్యంకర్ అందించిన నేపథ్య సంగీతం, పాటలు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి.రూ.300 కోట్ల మార్క్‌ను దాటిన 'కరుప్పు' ఇప్పుడు మరిన్ని వసూళ్ల రికార్డులపై కన్నేసింది. తమిళ సినీ పరిశ్రమలో కూడా 'కరుప్పు' ఒక ప్రత్యేక విజయగాథగా నిలిచేలా కనిపిస్తోంది.

EDITED , PRINTED, PUBLISHED & OWNED BY PRINTED AND PUBLISHED BY MAHESH ETABONIA ON BEHALF OF NETI PRASTAVANAM MEDIA NETWORK , HNO-14-249/1/37 SAI NAGAR COLONY,MEDCHAL(V) MEDCHAL MALIKAJGIRI, -501401 at 14-249/1/37 Sai Nagar Colony, MEDCHAl, TELANGANA STATE , EDITOR : MAHESH ETABONIA :9908086026 Website : https://netiprasthanam.in/